మెరుగైన ఉపాధికి 'టాస్క్'

- మదర్ థెరిసా కళాశాలలో ముగిసిన టాస్క్ స్కిల్ డెవలమెంట్ శిక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

పెద్దపల్లిరూరల్: ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధనకు తీవ్రమైన పోటీ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న స్వచ్ఛంద, యువజన, విద్యార్థి సంఘాలు, సంస్థలతోపాటు 'టాస్క్'కూడా యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం అనేక అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో మూడురోజులపాటు విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై అవగాహన కల్పించింది. దీంతో వారు భవిష్యత్‌లో సులభంగా ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దింది. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ఎలాంటి పోటీ పరీక్షలైనా, ఇంటర్వ్యూలైనా అధిగమించేలా శిక్షణ ఇచ్చింది. ఇందులో పాలుపంచుకున్న విద్యార్థులు నేర్చుకున్న అంశాలు వారి మాటల్లోనే..

మెలకువలు నేర్చుకున్న



తరగతి గదుల్లో చదివే చదువుకు తోడు పోటీపరీక్షల్లో నెగ్గేందుకు పాటించాల్సిన పద్ధతులపై టాస్క్ ఆధ్వర్యంలో ఇచ్చే శిక్షణతో అవసరమైన మెలకువలు నేర్చుకున్న. ఇలాంటి శిక్షణ భవిష్యత్‌లో ఉపయోపడుతుంది.

– అవంతి, సీఎస్‌సీ ఫైనలియర్

శిక్షణ బాగుంది



ఇంజినీరింగ్‌లో చేరి కోర్సు పూర్తిచేసుకుంటున్న మాకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కాలేజీలో ఏర్పాటు చేసిన శిక్షణ బాగుంది. ఉద్యోగం ఎలా సాధించాలనే దానిపై చక్కటి అవగాహన కల్పించడంతో నమ్మకం ఏర్పడింది.

– అంజలి, బీటెక్

భవిష్యత్‌కు పునాది



చదువుకు తగిన ఉద్యోగం సాధించేందుకు వీలుగా యాజమాన్యం మాకు శిక్షణ ఇప్పించడం సంతోషంగా ఉంది. ఇలాంటి శిక్షణ భవిష్యత్‌కు మంచి పునాది వేస్తుంది. పోటీ పరీక్షల్లో ఉద్యోగం సాధిస్తామనే నమ్మకం కలిగింది.

– వర్ష, సీఎస్‌సీ, ఫైనలియర్

నమ్మకం కలిగింది



చదువుకు తగిన ఉద్యోగావకాశాలు దక్కించుకునేందుకు ఇలాంటి శిక్షణ ద్వారా మరింత అవగాహన పెంచుకున్న. ఉద్యోగం సులువుగా పొందవచ్చనే నమ్మకం కలిగింది. టాస్క్ ఇచ్చే ఇలాంటి శిక్షణ మంచి భవిష్యత్‌ను ఇస్తుంది.

– నిహారిక, ఫైనలియర్

అవగాహన కల్పిస్తున్నాం



విద్యార్థుల చదువుకు తగ్గట్టు పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. ఉద్యోం ఎలా సాధించాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించాం.

– అమూల్య, ట్రైనర్

ఉద్యోగాలు దక్కేలా..



కాలేజ్‌లో చేరిన విద్యార్థి అర్హతలకు అనుగుణంగా ఉద్యోగావకాశాలు పొందేలా చూస్తున్నాం. ఇందుకోసం పలు కంపెనీలతో జాబ్‌మేళాలు ఏర్పాటు చేయించాం. టాస్క్ సహకారంతో నైపుణ్యం పెంచుతున్నాం.

– శ్రీనివాస్, ప్రిన్సిపాల్, మదర్ థెరిసా కాలేజ్

క్లుప్తంగా

తాగునీటి సరఫరా తీరుపై సమీక్ష



సమీక్షిస్తున్న ఎస్ఈ చిన్నారావు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో తాగునీటి సరఫరా తీరుపై వార్డు ఆఫీసర్లతో బుధవారం ఎస్ఈ చిన్నారావు సమీక్ష నిర్వహించారు. 50 డివిజన్లలో తాగునీటి సరఫరా జరుగుతున్న తీరు, లీకేజీలు, పనిచేయని బోర్లు, కొత్త పైప్‌లైన్ ఏర్పాటు, నల్లా కనెక్షన్ ఇవ్వాల్సిన ప్రాంతాలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు తదితర వాటిపై క్షేత్రస్థాయిలో డివిజన్లలో తిరిగి వాస్తవ వివరాలు సేకరించాలని ఇటీవల కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం వార్డు ఆఫీసర్లతో ఈఈ సుచరన్‌తో కలిసి ఎస్ఈ చిన్నారావు సమీక్ష నిర్వహించారు.

ఎంఈవోకు సన్మానం



పాలకుర్తి: ఉమ్మడి రామగుండం మండల విద్యాధికారిగా పనిచేసి గతనెల 31న ఉద్యోగ విరమణ పొందిన పల్లెపాటి సంపత్‌రావును బుధవారం కన్నాల కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సన్మానించారు. కన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంపత్‌రావు దంపతులను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ప్రస్తుత ఎంఈవో రాజయ్య, హెచ్‌ఎం.కమలాకర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

రామగిరి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశలత ఆదేశించారు. బుధవారం పన్నూర్ పంచాయతీ కార్యాలయంలో రామగిరి, ముత్తారం మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పైపులైన్ల లీకేజీలను సరిచేయాలని, గ్రామాల్లో నల్ల కనెక్షన్లు, మిషన్ భగీరథ పైపులైన్‌లను పరిశీలించి తాగునీటి సమస్య రాకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. డీఎల్‌పీవో శంకర్, ఎంపీవోలు సమ్మిరెడ్డి, వేణు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన వలస శ్రీనివాస్ కుమారుడు శివకుమార్ ఇటీవల మృతి చెందారు. దివ్యాంగుడైన శ్రీనివాస్ నిరుపేద కావడంతో 1990–91 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు బుధవారం అతడికి రూ.50వేల నగదు అందజేశారు. భైరగోని రవీందర్‌గౌడ్, ముత్యాలు, మధుకర్, సత్యం, రామ్మోహన్, కనుకయ్య ఉన్నారు.

హ్యాండ్ రైటింగ్ పోటీల్లో ప్రతిభ

గోదావరిఖనిటౌన్: ఇటీవల నిర్వహించిన లుసిడ్ హ్యాండ్ రైటింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానిక మార్గదర్శి విద్యావిహార్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి స్టేట్ ఫస్ట్ అవార్డు దక్కించుకున్నారు. బుధవారం స్థానిక గీతాంజలి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రాజయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

గని శిక్షణ కేంద్రంలో వసతులు కల్పించండి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియాలోని ఎంవీటీసీ (గని శిక్షణ కేంద్రం)లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు బుధవారం వీటీసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు భీముని సత్యనారాయణ, శ్రీనివాస్, రాజయ్య, పిట్టల శ్రీనివాస్, కమలాకర్, శేషు కుమార్, వీరభద్ర స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

నంది అవార్డు గ్రహీతకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ నంది అవార్డు గ్రహీత లక్ష్మణ్ కుమార్‌ను బుధవారం పాఠశాలలో సన్మానించారు. శిఖర ఆర్ట్స్ అకాడమీ వారు లక్ష్మణ్ కుమార్‌ను ఒకటో తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నంది అవార్డు అందజేశారు. కాగా ఆయనను హెచ్‌ఎం మానస, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

వైభవంగా బీరన్న పట్నం



పట్నంలో పాల్గొన్న భక్తులు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లిలో గొల్ల, కుర్మ కులస్తుల ఆరాధ్యదైవమైన బీరన్న పట్నాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం మల్లయ్యపల్లిలోని బీరన్న ఆలయంలో బీరన్న, కామరాతి నాగవెల్లి పట్నం వేశారు. మాజీ సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, పెద్దగొల్ల రేచవేని సతీశ్, పెద్ద కుర్మ కచ్చు బీరయ్య, కమిటీ సభ్యులు రేచవేని లింగయ్య, దాసరగొండ లింగయ్య, కచ్చు బక్కయ్య, రేచవేని మహేందర్, మారం సాగర్, గొల్ల, కుర్మలు పాల్గొన్నారు.

తారురోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి పర్మనెంట్ టౌన్‌షిప్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు నిర్మించేందుకు మూడునెలల క్రితం పనులు ప్రారంభించి వదిలేశారు. కంకర రోడ్డుతో ప్రజలు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న వైనంపై మార్చి 30న సాక్షిలో 'కంకర పోశారు..వదిలేశారు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో కార్పొరేటర్ కొలిపాక సుజాత స్థానిక ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌తో పాటు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. బుధవారం రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ కంకర రోడ్డుపై తారు వేయడం ప్రారంభించారు. రోడ్డుపనులు ప్రారంభం కావడంతో స్థానికులు కార్పొరేటర్‌కు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

రీజియన్ సేఫ్టీ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా ఏరియాకు వచ్చిన కేహెచ్‌ఎన్ గుప్తాను బుధవారం ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సన్మానించారు. ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, అధికారులు మురళీకృష్ణ, హుసేని, హరినారాయణ, వెంకటరామచంద్ర, వెంకటమోహన్ ఉన్నారు.

సింగరేణి పార్కుల నిర్వహణ చేపట్టాలి

గోదావరిఖని: స్థానిక పవర్‌హౌస్‌కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న పార్క్‌ను అభివృద్ధి చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా నిర్వహణ చేపట్టడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా పార్కులపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, సంపత్, గౌస్, శనగల శ్రీనివాస్ ఉన్నారు.

ఓసీపీల్లో షిఫ్టువేళలు మార్చాలి

గోదావరిఖని: వేసవిలో షిఫ్టు వేళలు మార్చాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి, మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎండలు పెరగడంతో మొదటి, రెండోషిఫ్టు సమయాలను మార్చాలన్నారు. సీఐటీయూ నాయకులు ఉల్లి మొగిలి, కుంట ప్రవీణ్‌కుమార్, సంపత్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి కాంట్రాక్టర్ జిన్న శ్రీనివాస్‌రెడ్డి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు బుధవారం రూ.లక్ష విరాళం అందించారు. మాజీ సర్పంచు తులా మనహర్‌రావు, సభ్యులు జంగ ప్రభాకర్‌రెడ్డి, గాదర్ల వెంకటేశ్, దొమ్మటి పోచాలు, గాజర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ముగ్గురిపై కేసు నమోదు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లిలో భూతగాదా విషయంలో దాడిచేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఓంకార్‌యాదవ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం తారుపల్లికి చెందిన బాసిరి మోహన్, బాసిరి అంజయ్య భూతగాదా విషయమై మంగళవారం గొడవ పడ్డారు. ఇది మనసులో పెట్టుకుని బాసిరి అంజయ్య, సంపత్, సురేశ్ అదేరోజు రాత్రి మోహన్ ఇంటికి వెళ్లి దాడి చేశారు. అడ్డు వచ్చిన బాసిరి శ్రీనివాస్‌పై దాడి చేశారు. దాడిలో గాయపడిన వీరిద్దరినీ చికిత్స నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. బాధితుడు మోహన్ భార్య జ్యోతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాడికి పాల్పడిన బాసిరి అంజయ్య సంపత్, సురేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై విచారణ

ధర్మారం: మండలంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై బుధవారం పెద్దపల్లి ఏసీపీ జి.శ్రీకృష్ణ విచారణ చేశారు. మండలంలోని కటికెనపల్లి, బంజేరుపల్లి తండాబి గ్రామాల్లో ఏసీపీతో పాటు పెద్దపల్లి సీఐ ఆర్.కృష్ణ, స్థానిక ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలానికెళ్లి విచారణ చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పాలకుర్తి: బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద బుధవారం కారు ఢీకొన్న ఘటనలో కండె చంద్రయ్య (65) అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కేశోరాం రిటైర్డ్ కార్మికుడైన చంద్రయ్య బైక్‌పై బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద ఫోర్‌లైన్ రోడ్డు దాటుతుండగా ఎన్టీపీసీ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో చంద్రయ్య కాలు విరిగి, తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు.

సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేయాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి గౌతమినగర్ వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు 24వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక సుజాత వినతిపత్రం అందించారు.

టిప్పర్, జేసీబీ సీజ్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని రాముని‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమి నుంచి మంగళవారం అక్రమంగా మట్టిని తరలిస్తుండగా టిప్పర్, జేసీబీ పట్టుకొని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ అన్నారు.

కార్మికులకు ప్రోత్సాహక బహుమతి ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియాలో 2023–24కు గాను 102శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించడానికి కృషి చేసిన కార్మికులకు సింగరేణి యాజమాన్యం ప్రోత్సాహక బహుమతులు అందించాలని ఏఐటీయూసీ ఆర్జీ–2 ఏరియా బ్రాంచ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యదర్శి జీగురు రవీందర్, ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సభ్యులు ఎల్.ప్రకాశ్, అన్నారావు, రాజయ్య, మహేందర్, వెంకటేశ్, దేవేందర్ సింగ్, సతీశ్, డి.వెంకటేశ్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

పాలకుర్తి: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శశికళ అధికారులను ఆదేశించారు. బుధవారం పాలకుర్తి మండల రైతువేదికలో కార్యదర్శులు, మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండల పంచాయతీ అధికారి షబ్బీర్‌పాషా, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, పుట్నూర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాయిసూర్య, బసంత్‌నగర్ పీహెచ్‌సీ వైద్యురాలు హరితభవాని, మండల వ్యవసాయాధికారి ప్రకాశ్, హార్టికల్చర్ మండల అధికారి శ్రీకాంత్, మిషన్ భగీరథ ఏఈ కోర్నియల్, ఉపాధిహామీ ఏపీఎం కొమురయ్య పాల్గొన్నారు.

గురుకులంలో వార్షిక వేడుకలు

ధర్మారం: ధర్మారం మండల కేంద్రంలోని గిరిజన మినీ గురుకులం బాలికల విద్యాలయంలో బుధవారం వార్షిక వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మానేరు ఇసుకను తరలిస్తే ఊరుకోం



మైనింగ్ ఏడీతో సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గట్టెపల్లి గ్రామ శివారులోని మానేరు వాగులోంచి ఇసుకను తరలిస్తే ఊరుకునేది లేదని గ్రామస్తులు అధికారుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి మానేరు వాగులో ఇసుక క్వారీ ద్వారా ఇసుకను తరలించడం ద్వారా సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని కలెక్టర్, సంబంధిత అధికారులకు గ్రామస్తులు వినతిపత్రం ఇవ్వడంతో పాటు క్వారీని మూసివేయాలని కోరారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ మధుసూధన్ రెడ్డి, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ క్వారీ వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. కాగా గ్రామస్తులు గత ప్రభుత్వం ఇచ్చిన ఇసుక క్వారీకి అనుమతి ఇవ్వడంతో ఇప్పటికే ఇసుక మొత్తం ఖాళీ అయిందని, దీంతో సాగు నీరు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. మళ్లీ ప్రస్తుతం ఆ క్వారీకి ఏడాది పాటు ఇసుక తీసుకోవచ్చని అనుమతులు లభించాయని, వెంటనే అనుమతి రద్దు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయమై ఏడీ మాట్లాడుతూ ఇసుక తీసుకునేందుకు ప్రభుత్వం తొమ్మిది రకాల షరతులతో క్వారీకి అనుమతి ఇచ్చిందని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు నివేదికను సమర్పించనున్నట్లు ఆయన చెప్పారు. గ్రామస్తులు దామోదర్, రాజమల్లు, శ్రీనివాస్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పిట్ సెక్రటరీకి సన్మానం



సన్మానిస్తున్న యూత్ సభ్యులు

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 పిట్ సెక్రటరీగా నియమితులైన రామిండ్ల మనోహర్‌ను బుధవారం లద్నాపూర్ ఎస్సీ కాలనీ యూత్ సభ్యులు సన్మానించారు. ఐఎన్‌టీయూసీలో సామాన్య కార్యకర్తగా కష్టపడుతూ నేడు పిట్ సెక్రటరీ స్థాయికి ఎదిగారని, భవిష్యత్‌లో మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. యూత్ సభ్యులు అడ్డూరి ప్రవీణ్, రామిల్ల రాజేందర్, అడ్డూరి శ్రీకాంత్, అడ్డూరి నవీన్, ఈర్ల పవన్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఆర్డీవో

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం మంథని ఆర్డీవో హనుమనాయక్ ప్రారంభించారు.

రామగిరి: సెంటనరీకాలనీ పన్నూర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని మంథని డీఎల్‌పీవో శంకర్ ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో చలివేంద్రాన్ని ఎంపీడీవో శైలజారాణి ప్రారంభించారు.

ఓడెల: ఓదెల తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ యాకన్న ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు.

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి శివయ్య ప్రారంభించారు.

సుల్తానాబాద్: ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జిల్లా పశు వైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి చలివేంద్రం ప్రారంభించారు.

కాల్వశ్రీరాంపూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ జాహెద్ పాషా ప్రారంభించారు.

ఘనంగా ఎల్లమ్మ పట్నాలు



కాచాపూర్‌లో పట్నంలో పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లో గీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుకా ఎల్లమ్మ పట్నాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో శోభాయాత్రగా తీసుకెళ్లి ఆలయంలో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. సంఘం అధ్యక్షుడు మోటపోతుల రాజేశం, హరికృష్ణ, గీత కార్మికులు ఉన్నారు. కోనరావుపేటలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమల్లికార్జున స్వామి పట్నాల్లో భాగంగా బుధవారం నాగవెల్లి పట్నం వేశారు. మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పట్నాల్లో ఎంపీపీ రమాదేవి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం అధ్యక్షుడు కత్తెర్ల రాయమల్లు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల'ను విజయవంతం చేయాలి



పాలకుర్తి: మాట్లాడుతున్న డీఎఫ్‌వో శివయ్య

పాలకుర్తి: జిల్లాలో నూతనంగా చేపట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమం విజయవంతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా అటవీశాఖాధికారి, పాలకుర్తి మండల ప్రత్యేకాధికారి శివయ్య ఆదేశించారు. బుధవారం పాలకుర్తి గ్రామ రైతువేదికలో అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో షబ్బీర్‌పాషా, పంచాయతీరాజ్ ఏఈ.శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం సదానందం, మండల సమాఖ్య సంఘాల కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

ఓడెల: మండలపరిషత్ కార్యాలయంలో ప్లానింగ్ జిల్లా కోఆర్డినేటర్ మల్లేశంగౌడ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో భాస్కర్, ఏఈఈ సమ్మిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కవీశ్వర్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామగిరి: మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో శైలజారాణితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీవో సమ్మిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శృతి, మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఏపీఎం స్వరూపరాణి పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణపై సమీక్ష

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు, విధుల నిర్వహణపై మండల విద్యాధికారి రాజయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా సెక్టోరియల్ అధికారి విజయకుమార్, మెప్మా జిల్లా అధికారి రజనీ, ఎంఎన్‌వో చంద్రయ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు సమావేశం నిర్వహించారు. ఎంపీవో ఫయాజ్ అలీ, ఏఈ సతీశ్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, హెచ్‌ఎం రత్నాకర్‌రెడ్డి ఉన్నారు.

జూలపల్లి: ఎంపీడీవో పద్మజ అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటుపై ఎంఈవో కవిత సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ ఏఎంవో డా.పీఎం షేక్, తహసీల్దారు బషీరొద్దీన్, డిటి అబూబాకర్, ఎంపీవో కిరణ్, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఎంఎస్‌వో సరస్వతీ, ఏఈ సువిశాల ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రెబ్బల్‌దేవ్‌పల్లి, చిన్నబొంకూర్, మియాపూర్, పెర్కపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం చైర్మన్ మోహన్‌రావుతో కలిసి ప్రారంభించారు. కార్యదర్శి రమేశ్, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ఐకేపీ నేతృత్వంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ జాహెద్ పాషా, ఎంపీడీవో రామ్మోహనా చారి, ఏపీఎం కనుకయ్య ప్రారంభించారు. రైతులు తాము పండించిన వరిధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించొద్దని సూచించారు. తేమలేకుండా శుభ్రం చేసి కొనుగోలు కేంద్రానికి తరలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. ఏపీవో గోవర్ధన్, వీవోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. మహిళలు బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించారు.